క్లుప్తంగా

ఆలయ భూములపై సర్వే

వరంగల్ చౌరస్తా : వరంగల్ నడిబొడ్డున ఉన్న చారిత్రాత్మక భూనిలా సమిత గోవిందరాజ స్వామి ఆలయ భూములపై మంగళవారం సర్వే నిర్వహించారు. సర్వే ల్యాండ్స్, దేవాదాయ శాఖ, బల్దియా సిబ్బంది అధికారులు, సిబ్బంది ఆలయ పాతరికార్డులు ఆధారంగా వివరాలను సేకరించి మార్కింగ్ చేశారు.

రక్తదాతకు సన్మానం

ఎంజీఎం : గత నాలుగేళ్లుగా అనేకసార్లు రక్తదానం చేయడంతో పాటు రక్తదాన శిబిరాలు నిర్వహించిన కేఎంసీ మెడికల్ విద్యార్థి అశ్విని నవదీప్‌ను జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంజీఎంలో నిర్వహించిన రక్తదాతల అభినందన సభలో కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ సిహెచ్.మురళీ, ఆర్ఎంఓలు మురళీ, అంబి శ్రీనివాస్, అడిషనల్ ఆర్ఎంఓ డాక్టర్ శశికుమార్, బ్లడ్ బ్యాంక్ వైద్యాధికారి డాక్టర్ ఆశాదేవిలు శాలువాతో సత్కరించి, జ్ఞాపిక, ప్రశంసపత్రం అందజేశారు.

కుమ్మర సంఘం ఇన్‌చార్జ్‌గా దశరథం

మామునూరు: తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆవునూరి దశరథం నియామకమయ్యారు. మంగళవారం జిల్లా అధ్యక్షుడు ఆవునూరి రామన్న చేతుల మీదుగా దశరథం నియామక పత్రాన్ని అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన కుమ్మరి సంఘం ప్రతినిధులు పోతుగంటి రాజశేఖర్, చంద్రమౌళి, రాజేశ్‌కు దశరథం కృతజ్ఞతలు తెలిపారు

వరద బాధితులకు విరాళం

కాజీపేట రూరల్ : ఫాతిమానగర్ బిషప్‌బెరెట్టా హైస్కూల్ పిల్లలు, ఉపాధ్యాయులు మంగళవారం వరదబాధితుల సహాయార్థం సేకరించిన రూ.1లక్షను ప్రిన్సిపాల్ జయప్రతాప్‌రెడ్డికి అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖమ్మం, విజయవాడ వరద బాధితుల సహాయార్థం నిధులు సేకరించి ప్రిన్సిపాల్‌కు అందజేశారు. సేకరించిన నిధులను ఓరుగల్లు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ డాక్టర్ ఉడుముల బాలకు అందజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

రామన్నపేట : నగరంలోని ఇస్లామియా గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంగళవారం మంత్రి కొండా సురేఖ ప్రారంభించారు. దసరా సెలవుల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫన్‌ఫెయిర్ ఎగ్జిబిషన్ నగర ప్రజలకు ఉత్సాహాన్ని నింపుతుందన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్ : ఈనెల 22 ,23వ తేదీల్లో నగరంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో బాటనీ విభాగం ఆధ్వర్యంలో 'రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ప్లాంట్ సైన్స్ రీసెర్చ్' అనే అంశం నిర్వహించనున్న బోటనీ జాతీయ సదస్సుకు సంబంధించి బ్రోచర్‌ను మంగళవారం కేయూ బాటనీ బీఓఎస్ ప్రొఫెసర్ ముస్తఫా ఆవిష్కరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు.

మరుగుదొడ్లు లేక ఇబ్బందులు

హన్మకొండ అర్బన్ : జిల్లాలోని అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్ లేక ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రజలు అనేకమంది ఇబ్బందులకు గురవుతున్నారని వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ వ్యవస్థాపకుడు సిరాజుద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ అధ్యక్షుడు ప్రొఫెసర్ సురేష్‌లాల్, సభ్యులతో కలిసి మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతిపత్రం అందజేశారు.

నీటి సమస్య పరిష్కరించాలి

కాశిబుగ్గ : వేసవి రాకముందే నగరంలోని డివిజన్లలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వాటిని పరిష్కరించాలని 34, 35వ డివిజన్ల కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం జీడబ్ల్యూఎంసీ వాటర్ ఇన్‌చార్జ్ ఎస్ఈ ప్రవీణ్ చంద్రతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో భట్టుపల్లి వాల్ నుంచి శివనగర్, పుప్పాలగుట్ట, ఖిలావరంగల్ వాటర్ ట్యాంక్‌లకు 2400 కెపాసిటీతో నీళ్ల సరఫరా జరిగేదని, ప్రస్తుతం 1300 కెపాసిటీతో వస్తున్నాయన్నారు. నగరంలోని కొన్ని డివిజన్లకు నీటి సరఫరా సక్రమంగా జరుగుతున్న 34, 35, 36, 37, 38 డివిజన్లకు సరిగా సరఫరా కావడం లేదన్నారు.

యువకుడి ఆత్మహత్య

కాజీపేట: కాజీపేట మండలం దర్గా కాజీపేట శివారులోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన నెలకంటి రాకేష్ (35) కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. రాకేష్ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

ఇనుప గ్రిల్స్ చోరీ

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం ఆవరణలోని గ్రీనరీ వెంట ఉన్న ఇనుప గ్రి ల్స్‌ను సోమవారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. గ త రెండు రోజులుగా బిహార్‌కు చెందిన దొంగలు గ్రి ల్స్‌ను తొలగిస్తుండటంతో సెక్యూరిటీ గార్డు ప ట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. మా రోమారు మాయం కావడం చర్చనీయాంశంగా మారింది.

భూ పంచాయితీలకే ప్రాధాన్యం!

- భూ తగాదాల్లో దామెర పోలీసులు
- పిటిషన్‌తో సంబంధం లేకుండా కేసుల నమోదు
- కోర్టు ఆదేశాలు.. ఏడీ నివేదికలు తుంగలోకి..
- న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్‌కు బాధితుల ఫిర్యాదు



వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఎదుట బాధిత కుటుంబం

వరంగల్ క్రైం: 'సివిల్ తగాదాలు ఇక్కడ పరిష్కరించబడవు. మీరు కోర్టుకు వెళ్లండి' అని పోలీస్ స్టేషన్లలో రాసి ఉంటుంది. నిబంధనల ప్రకారం.. భూములకు సంబంధించిన వ్యవహారాల్లో పోలీసులు జోక్యం చేసుకోవద్దు. కానీ.. పరకాల సబ్ డివిజన్‌లోని దామెర పోలీస్ స్టేషన్‌లో మాత్రం భూముల పంచాయితీకే మొదటి ప్రాధాన్యం ఇస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దామెర మండలం ముస్త్యాలపల్లికి చెందిన ఓ బాధిత కుటుంబం తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దీనిపై విచారించకపోగా.. వారిపైనే తిరిగి కేసు నమోదు చేశారు. చివరికి బాధితురాలు సీపీని ఆశ్రయించి న్యాయం చేయాలని వేడుకుంటోంది. వివరాల్లోకి వెళ్తే.. ముస్త్యాలపల్లికి చెందిన బండారి వెంకటేశ్వర్లు 2018లో అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య సుజాత.. భర్త వారసత్వంగా వచ్చిన భూమిని అనుభవిస్తూ.. ఇద్దరు పిల్లల పెళ్లి చేసింది. మరో అమ్మాయి పెళ్లికి ఉంది. ఆ కుటుంబానికి ఎవరూ అండగా లేరనే కారణంతో వారసత్వంగా 1975 నుంచి వారి ఆధీనంలో ఉన్న భూమిని కొంతమంది ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారు. భూ అక్రమార్కులు పెడుతున్న ఇబ్బందులపై ఆమె దామెర పోలీసులను ఆశ్రయించింది. ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్న వారి వివరాలు, భూమి సర్వేనంబర్లను ఫిర్యాదులో పేర్కొంది. కానీ పోలీసులు ఆమె ఫిర్యాదును కనీసం పరిగణనలోకి కూడా తీసుకోలేదు. ఈ క్రమంలో ఆమెకు వ్యతిరేకంగా ఉన్న వారు ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్న ఖాకీలు.. వెంటనే సుజాతపై కేసు నమోదు చేశారు. పిటిషన్‌లో పేర్కొన్న సర్వేనంబర్ భూమిపై కేసు నమోదు చేయకుండా బాధితుల సర్వేనంబర్ భూమిని ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసి కేసు చేశారు. ఈ విషయాన్ని బాధితులు పసిగట్టారని తెలుసుకుని.. వారిని బెదిరించి బలవంతంగా ఇంటికి వెళ్లి నోటీసులు అందించినట్లు తెలిసింది. పైగా.. కేసును సెటిల్ చేసుకోవాలని ఉచిత సలహా కూడా ఇచ్చారని సమాచారం.

కోర్టు ఆదేశాలు...ఏడీ సర్వే నివేదికలు చెల్లవట..

బాధితురాలు సుజాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తమ భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారని చెప్పగా ముందుగా మీరు మండల సర్వేయర్, ఆ తరువాత ఏడీతో సర్వే చేయించి నివేదికలు ఇవ్వాలని సూచించారు. దీంతో ఆమె వారిద్దరితో భూమిని సర్వే చేయించి పోలీసులకు వివరాలు ఇచ్చారు. వాటిని పరిశీలించిన పోలీసులు ఇవి చెల్లవని చెప్పారు. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించింది. కోర్టు కూడా భూమి విషయంలో పోలీసులు జోక్యం చేసుకోవద్దని ఆదేశాలు ఇచ్చింది. అయినా పోలీసులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకపోవడం, ఆక్రమణకు యత్నిస్తున్న వారికి అండగా నిలుస్తున్నారని భావించిన బాధితురాలు చివరికి పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను కలిసి తన సమస్యను వివరించింది. దామెర పోలీసుల తీరుపై ఫిర్యాదు చేసింది. స్పందించిన సీపీ క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని టాస్క్‌ఫోర్స్ అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.

నన్ను.. నా పిల్లలను కాపాడాలి..



నా కుటుంబానికి ఆధారంగా ఉన్న భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్న వారి నుంచి మాకు ప్రాణహాని ఉంది. స్థానిక పోలీసులు నాకు న్యాయం చేయడం లేదు. నా వైపు తప్పు ఉంటే ఏ శిక్ష వేసినా అనుభవిస్తా. భూములకు సంబంధించిన రికార్డులు, స్థానికుల అభిప్రాయం ప్రకారం నాకు న్యాయం చేయాలి. నన్ను, నా పిల్లలను పోలీస్ కమిషనర్ కాపాడాలి.

– బండారి సుజాత

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు అహ్వానం


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హన్మకొండ అర్బన్ : నగరంలోని పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవికి శ్రీహనుమద్గిరి పద్మాక్షి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ఈనెల 3 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించబోయే శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభోత్సవానికి రావాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, షణ్ముఖ పద్మనాభ అవధానిలు కలిసి అహ్వానించారు.

రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

కాశిబుగ్గ : వరంగల్, నర్సంపేట ప్రధాన రహదారి వెంబడి దయానంద కాలనీ సమీపంలోని కనకదుర్గ మాత దేవాలయంలో ఈనెల 3 నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ తెలిపారు. మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు, సర్వరియా సురేష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

టీజీఓ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం


జగన్‌మోహన్‌రావును సన్మానిస్తున్న టీజీవోస్ బాధ్యులు

హన్మకొండ అర్బన్ : ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ కోఆపరేటివ్ టీజీవోస్ సభ్యుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్నమనేని జగన్‌మోహన్‌రావును మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సహకార శాఖ కార్యాలయంలో హనుమకొండ, వరంగల్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ జిల్లాలో పనిచేస్తున్న ఈగ వెంకటేశ్వర్లు జాయింట్ సెక్రటరీగా, భూపాలపల్లి జిల్లాలో పనిచేస్తున్న నాగ నారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎన్నికైనందున వారిని పుష్పగుచ్ఛాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఫణికుమార్, ప్రవీణ్‌కుమార్, నీరజ, రాజేష్‌కుమార్, అన్వర్ హుస్సేన్, వెంకటేశ్వర్లు, రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజును ఎమ్మెల్యే పదవినుంచి తొలగించాలి

నయీంనగర్: మాదిగలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కెఆర్.నాగరాజును కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేసి ఎమ్మెల్యే పదవి నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం లష్కర్ సింగారం ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సుకుమార్ మాట్లాడుతూ కేవలం మాలల ఓట్లతోనే గెలిచానని విర్రవీగుతున్న నాగరాజు రాజీనామా చేసి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పును తప్పుపట్టిన ఎమ్మెల్యే మాటలను సుమోటోగా తీసుకొని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎర్ర రాము మాదిగ, మంద స్వరాజ్ మాదిగ, రాజేష్ మాదిగ రజనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నోరుంది కదా అని మాట్లాడితే ఊరుకునేది లేదు

కాశిబుగ్గ : నోరు ఉంది కదా అని హిందూ దేవాలయాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును హెచ్చరించారు. మంగళవారం కాశిబుగ్గలో మహాత్మగాంధీ విగ్రహం శుద్ధి చేయడానికి వచ్చిన రవికుమార్ మాట్లాడుతూ ఓ పోలీస్ ఆఫీసర్‌గా పని చేసిన నువ్వు ఎమ్మెల్యేగా గెలిచినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఐడెంటి కోసం హిందూ దేవాలయాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడన్నారు. గుడి గురించి మాట్లాడిన నువ్వు చర్చి, మసీదు, మదర్సాల గురించి మాట్లాడే దమ్ము ఉందా అని ఎమ్మెల్యేను ప్రశ్నించారు.

మంత్రిపై బీఆర్ఎస్ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం


ఎర్రబెల్లి స్వర్ణ

వరంగల్: కొండా లక్ష్మణ్ బాపూజీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి కొండా సురేఖపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకుల, ఆ పార్టీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. హనుమకొండలో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఒక సోదరికి, సోదరుడికి ఉండే సంబంధాన్ని కూడా తప్పుపట్టడం సిగ్గుచేటని, బీఆర్ఎస్ నేతలకు అక్కా-చెల్లెల్లు, త ల్లీ-బిడ్డలు లేరా అని ప్రశ్నించారు. తక్షణమే భేషరతుగా క్షమాపణ చెప్పాలని లేకుంటే బీఆర్ఎస్ నే తలను ప్రజాక్షేత్రంలోతిరగనివ్వమని హెచ్చరించారు.

సురేఖపై వ్యాఖ్యలు గర్హనీయం

మంత్రి కొండా సురేఖపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కేటీఆర్,హరీష్‌రావు బహిరంగ క్షమాపణ చెప్పాలి

ఖిలా వరంగల్: రాష్ట్ర మంత్రి పద్మశాలి ముద్దు బిడ్డ కొండా సురేఖపై కేటీఆర్, హరీష్‌రావు అనుచరులు సోషల్ మీడియా వేదిక ద్వారా చేసిన దుష్ప్రచారానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే పద్మశాలీల ఆగ్రహానికి గురికాక తప్పదని పోపా రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్ ముదసిర్ మహ్మద్ ఖయ్యూమ్, జిల్లా వైస్ చైర్మన్ గునిగంటి శ్రీనివాస్, కన్వీనర్ కొక్కండి రమేష్, పాల్గొన్నారు

కాజీపేట: మంత్రి సురేఖపై బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన కేటీఆర్, హరీష్‌రావులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలంగాణ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి డిమాండ్ చేశారు. కాజీపేటలో ఆయన మాట్లాడుతూ ఒక ట్వీట్‌తో హ రీష్‌రావు సరిపెట్టుకోవడం సరైందికాదని విమర్శించారు.

కేయూ క్యాంపస్: సోషల్ మీడియాలో మంత్రిపై దాడి చేయటం హేయమైన చర్యగా భావిస్తున్నామని దీనికి కేటీఆర్ మంత్రి సురేఖకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని తెలంగాణ పద్మశాలి విద్యార్థి సంఘం, నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ మేడారపు సుధాకర్ డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ బాధ్యులు నరేష్, అభిరామ్, సాయి వికాస్, రమేష్‌చంద్ర, అరుణ్‌కుమార్, కుమారస్వామి, నరేందర్, మొగిలి, తేజ, అనిల్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆట స్థలంపై వివాదం


స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాద్

హసన్‌పర్తి : మండలంలోని జయగిరిలో బతుకమ్మ ఆట స్థలంపై మళ్లీ వివాదం నెలకొంది. రెండేళ్లుగా ఈ వివాదం కొనసాగుతోంది. ప్రస్తుతం పది రోజుల్లో బతుకమ్మ వేడుకలు ఉన్నందున సమస్య పరిష్కారానికి మండల అధికారులు క్షేత్రస్థాయిని సందర్శించారు. జయగిరి శివారులోని సర్వేనంబర్ 108లో సుమారు 0.20 ఎకరాల భూమిని ఆ గ్రామానికి చెందిన చింతలపాణి దామోదర్‌రెడ్డి వందేళ్ల క్రితం బతుకమ్మ ఉత్సవాలను దానంగా ఇచ్చాడని స్థానికులు చెబుతున్నారు. వందేళ్లుగా ఇదే స్థ లంలో గ్రామస్తులు బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నారు. కాలక్రమేణా ఇక్కడ భూములకు ధర పెరిగింది. దీంతో ఆ భూసామి వారసులు ఆ భూమిని విక్రయించారు.

మొదలైన సమస్య

కాగా, భూమి విక్రయించడంతో సమస్య ఉత్పన్నమైంది. ఖరీదుదారుడు ఈ భూమిలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించుకోవడానికి నిరాకరించాడు. దీంతో అక్కడ జరిగిన పరిణామాల మేరకు గతేడాది అప్పటి సర్పంచ్ భర్త రాజుతో పాటు మరికొంత మందిపై హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. అయినప్పటికీ గతేడాది ఆ స్థలంలో ఉత్సవాలు నిర్వహించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్య...

బతుకమ్మ నిర్వహించుకునే స్థల విషయమై స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు దృష్టికి వెళ్లింది. ఎమ్మెల్యే స్పందించి వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కరించాలని తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సీఐ, ఎంపీఓలను ఆదేశించారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ముందస్తుగా నగరంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పిల్లలు, విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మలను తయారు చేసి పేర్చి కళాశాల, పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచంలో పూలను పూజించే పండుగ ఏకైక పండుగ బతుకమ్మ అని కొనియాడారు. కార్యక్రమాల్లో ప్రి న్సిపాళ్లు, హెచ్ఎంలు, మహిళా ఉపాధ్యాయులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్

నయీంనగర్ : మాస్టర్ జీ స్కూల్‌లో..


హన్మకొండ : బతుకమ్మలతో ఫ్లైన్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థినిలు


హసన్‌పర్తి: సుమతిరెడ్డి కళాశాలలో బతుకమ్మ వేడుకలు


ఖిలావరంగల్ : శివనగర్‌లో ఏకశిల డిజిస్కూల్‌లో..



వరంగల్ : స్కాలర్స్ స్కూల్‌లో..


వరంగల్ చౌరస్తా : సరస్వతి విద్యానికేతన్‌లో ..


కేయూ క్యాంపస్ : బతుకమ్మ సంబురాలు ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి


రామన్నపేట : ఎల్‌బీ కళాశాలలో ..


హన్మకొండ చౌరస్తా : పాలెం స్కూల్‌లో..


కాజీపేట రూరల్ : బిషప్‌బెరెట్టా హైస్కూల్‌లో


మడికొండ : మాస్టర్జీ స్కూల్‌లో..


హన్మకొండ అర్బన్: శ్రీనివాస్ గురుకుల్ స్కూల్‌లో..


కాజీపేట : 63వ డివిజన్ విష్ణుపురిలో..

మంత్రిని కలిసిన దసరా ఉత్సవ కమిటీ బృందం

ఖిలావరంగల్ : విజయదశమిని పురస్కరించుకుని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను మంగళవారం వరంగల్ రంగశాయిపేట మహంకాళీమైదానం దసరా ఉత్సవ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని కలిసి రావణవధకు తగిన ఏర్పాట్లు చేయించాలని కోరారు. బల్దియా అధికారులకు స్పష్టమైన ఆదేశాల ఇస్తామని మంత్రి తెలిపినట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుండు పూర్ణచందర్ తెలిపారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు

ఖిలా వరంగల్: క్రమశిక్షణతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి కె.మాధవరావు సూచించారు. మంగళవారం వరంగల్ శంభునిపేట (రంగశాయిపేట) ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రథమ సంవత్సర విద్యార్థుల స్వాగతోత్సవ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై ఫ్రెషర్ డే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

పూల కొనుగోళ్లతో రోడ్లన్నీ రద్దీ

హన్మకొండ కల్చరల్ : ఎంగిలిపూల బతుకమ్మ బుధవారం కావడంతో బతుకమ్మను పేర్చడానికి కావల్సిన రంగులు, తంగేడుపూలు, గునుగు, వివిధ రంగులలో ముంచిన గునుగుపూలు, తామర పూలు, చామంతి, బంతి, సీతజడలు, గుమ్మడి ఆకులు మొదలైనవి కొనుగోలు చేయడానికి వచ్చిన వారితో మంగళవారం రాత్రి రోడ్లు కిక్కిరిసిపోయాయి. యువతులు గాజులు, అలంకరణ సామాగ్రి కొనుగోలు చేశారు. హనుమకొండ చౌరస్తా , కుమార్‌పల్లి, టైలర్‌స్ట్రీట్, అంబేడ్కర్ సెంటర్, అదాలత్‌సెంటర్, వరంగల్‌లోని పిన్నవారి వీధి, రామన్నపేట, బట్టల బజార్, కాశీబుగ్గ, గోపాలస్వామి గుడి, హన్మకొండ భవానీనగర్‌బోర్డు, సుబేదారిలోని అమరవీరుల స్తూపం, కాజీపేటలోని బాపూజీ నగర్ తదితర ప్రాంతాల్లో అమ్మకాలు జోరుగా సాగాయి.

సంక్షిప్త సమాచారం

ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి

కాజీపేట రూరల్ : స్థానిక ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ సభ్యుల సమస్యలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మైసారపు సిరిల్ లారెన్స్ అన్నారు. బాపూజీనగ్‌లో మంగళవారం అసోసియేషన్ అధ్యక్షుడు పోగుల జాక్సన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యులకు పథకాలు ఎమ్మెల్యే ద్వారా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వృద్ధులకు సన్మానం

మామునూరు : అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం గ్రామంలో ఏకశిలా యూత్ అసోసియేషన్ అండ్ లైబ్రరీ ఆధ్వర్యంలో వృద్ధులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మేకల సూరయ్య హాజరై వృద్ధులను శాలువాలతో సన్మానించారు. రవి, భీమలింగం, సా రయ్య, శంకర్, సుధాకర్, చంద్రమ్మ, యాదగిరి, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన రైస్‌మిల్లర్స్ ప్రతినిధులు

వరంగల్ చౌరస్తా : రాష్ట్ర సివిల్ సప్లయీ కమిషనర్ చౌహాన్‌ను మంగళవారం హైదరాబాద్‌లో ఇటీవల నూతనంగా ఎన్నికైన రైస్ మిల్ అసోసియేషన్ కార్యవర్గం కలిసింది. కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ కుమార్ గౌడ్, సెక్రటరీ రాధిక ప్రదీప్, కోశాధికారి లక్ష్మణ్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు పెద్ది వెంకట్‌నారాయణ గౌడ్, హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంతోష్, రైస్‌మిల్ సభ్యులు తదితరులు ఉన్నారు.

దర్గా ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలి

కాజీపేట రూరల్ : 48వ డివిజన్ దర్గా ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలని సీపీఎం కాజీపేట మండల ఇన్‌చార్జ్ కార్యదర్శి సాంబయ్య డిమాండ్ చేశారు. దర్గా కనకదుర్గ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ మహాసభ మండల కమిటీ సభ్యులు పాతరబోయిన సర్వయ్య అధ్యక్షతన జరిగింది. సాంబయ్య మాట్లాడుతూ దర్గా నుంచి భట్టుపల్లి వైపు వెళ్లే రైల్వే బ్రిడ్జిని ప్రారంభించి రెండేళ్లు కావస్తున్నప్పటికి నేటికి అది పూర్తి కాకపోవడం, అండర్ బ్రిడ్జి నిర్మించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా తొట్టె మల్లేషం, సహాయ కార్యదర్శిగా సర్వయతో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఎం కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు.

పరామర్శ

రామన్నపేట : ఇటీవల కిడ్నీ స్టోన్స్, అపెండిక్స్ ఆపరేషన్ల అనంతరం రామన్నపేటలోని తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్టు వెంకటేశ్వర్లు (వెంకన్న)ను మంగళవారం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ కలిసి పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జర్నలిస్టులు ఉన్నారు.

మాలలు ఐక్యంగా ఉద్యమించాలి

హసన్‌పర్తి : సమస్యల సాధన కోసం మాలలు ఐక్యంగా ఉద్యమించాలని రిటైర్డ్ డీఎస్పీ నర్సయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని విజయా గార్డెన్‌లో మంగళవారం మాలల మహానాడు సమావేశం జరిగింది. సమావేశానికి నర్సయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈనెల 20న హనుమకొండలో నిర్వహించతలపెట్టిన మాల ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాల మహా నాడు మండల అధ్యక్షుడు పోతరాజు ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దావ రవి, తెలంగాణ మాల మహానాడు సోషల్ మీడియా ఇన్‌చార్జ్ దండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే ముందు జాగ్రత్త

కాజీపేట: బతుకమ్మ, దసరా సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ వై.సుధాకర్‌రెడ్డి కోరారు. కాజీపేట పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ వరుస సెలవుల నేపథ్యంలో పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామన్నారు. కాలనీల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు తారసపడితే కాలనీల అభివృద్ధి కమిటీ సభ్యులు పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అనుమానితులు కనిపిస్తే డయల్ 100తో పాటు 87126-85122 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

బొడ్డెమ్మ నిమజ్జనం

మడికొండ: బతుకమ్మ పండుగకు ముందు బొడ్డెమ్మను మహిళలు చెరువులో నిమజ్జనం చేశారు. సోమవారం రాత్రి బొడ్డెమ్మ చివరి రోజున మడికొండలోని పలు కాలనీలలో బొడ్డెమ్మ పండుగను గత తొమ్మిది రోజులుగా మహిళలు, పిల్లలు పాటలతో బొడ్డెమ్మ ఆటను ఆడుకున్నారు.


వైద్యశిబిరానికి అపూర్వ స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ 41వ డివిజన్ శంభునిపేటలోని విశ్వనాథ కాలనీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణలో దర్శన కంటి హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ సహకారంతో మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. రవీందర్ హాజరై ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైద్య శిబిరాలను వినియోగించుకుని నేత్రాలను కాపాడుకోవాలని సూచించారు. అనంతరం నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులను అందజేశారు.

సహచరుల చేయూత

కాశిబుగ్గ : హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పీఆర్వోగా పని చేస్తున్న నామని రాజ్‌కుమార్ గుండెపోటుతో మృతి చెందగా సహచర సిబ్బంది అండగా నిలిచారు. మంగళవారం వారంతా ఓ సిటీలోని రాజ్‌కుమార్ నివాసానికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 45 వేల నగదు, క్వింటా బియ్యాన్ని అందజేశారు.

ఆవిర్భావ సభను విజయవంతం చేయాలి



హన్మకొండ కల్చరల్ : తెలంగాణ ప్రజాఫంట్ 15వ ఆవిర్భావ సభ విజయవంతం చేయాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ బి.రమాదేవి అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబంధిత కరపత్రాన్ని ఆమె ఆవిష్కరించారు. రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 9న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య వి జ్ఞాన కేంద్రంలో సభ నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రజాసంఘాలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.